

TGTEL/25/A2594

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 35 | హైదరాబాద్ | శనివారం | 25-07-2026 | పేజీలు: 08


# నీట్ లీకేజీపై బీఆర్ఎస్ సమరశంఖం

ధర్నా చౌక్‌లో
కేటీఆర్ భారీ నిరసన
విద్యాశాఖ మంత్రి
రాజీనామాకు డిమాండ్!
కేటీఆర్ ఆధ్వర్యంలో
ఉధృతమైన పోరాటం
పుట్టినరోజు వేడుకలు
రద్దు చేసుకున్న కేటీఆర్
నల్ల చొక్కా ధరించి
ధర్నా చౌక్‌కు రాక
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
చేయాలని డిమాండ్
కేంద్ర ప్రభుత్వంపై
కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ యుజీ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా మరియు ఢిల్లీలో పోరాడుతున్న విద్యార్థులపై కేంద్ర పోలీసుల అణచివేత ధోరణికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగమైన బీఆర్ఎస్వీ పిలుపు మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ (ధర్నా చౌక్) వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాకు రాజధానితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.
విద్యార్థుల భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన వ్యక్తిగత వేడుకలను పక్కనబెట్టారు. శుక్రవారం తన జన్మదినం ఉన్నప్పటికీ, సంబరాలకు దూరంగా మిగతా 2లో..




## లిఖిత పూర్వక హామీ ఇచ్చాకే దీక్ష విరమించా

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్పష్టీకరణ
పార్లమెంట్‌లో చర్చిస్తామని సర్కార్ హామీ
విద్యార్థులపై కేసులు పెట్టబోమని కేంద్రం స్పష్టత
బాధిత కుటుంబాలకు ఆసరా
ఇస్తామని సర్కారు హామీ ఇచ్చిందన్న సోనమ్
విద్యాశాఖ మంత్రి రాజీనామా వరకు పోరాటం ఆగదన్న దీప్కే
జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల నిరసనలు
మోదీ వీడియోపై మండిపడిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
యువతకు ప్రధాని క్షమాపణలు చెప్పాలని రాహుల్ డిమాండ్




## నీట్ యుజీ లీకేజీ రచ్చ

విద్యాశాఖ మంత్రి రాజీనామాకు
పట్టుపడుతున్న విపక్షాలు
నాలుగో రోజూ పార్లమెంట్
మకరద్వారం వద్ద విపక్ష ఎంపీల నిరసన
పరస్పరం విమర్శలు
గుప్పించుకున్న అధికార, ప్రతిపక్షాలు
యువత భవిష్యత్తుపై
కాంగ్రెస్ మూడు ప్రధాన డిమాండ్లు
ప్రధాని మోదీ సభలోనే ప్రకటన
చేయాలని ఖర్గే స్పష్టం
ప్రధాని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల
హామీ అసత్యమైనది
ఆప్ అధినేత కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు




## లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు షాక్..

హైడ్రా తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై తీవ్ర ఆగ్రహం
కమిషనర్ రంగనాథ్‌కు
అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
తదుపరి విచారణ
సోమవారానికి వాయిదా

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** హైదరాబాద్‌లోని లోతుకుంట భూముల వివాదంపై తెలంగాణ హైకోర్టులో మరోసారి తీవ్రస్థాయిలో విచారణ జరిగింది. కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవహరించడంపై హైకోర్టు ధర్మాసనం హైడ్రా (HYDRAA) తీరును తీవ్రంగా తప్పుపట్టింది. ఈ విచారణకు హైడ్రా మిగతా 2లో..



## విద్యార్థుల నోళ్లు నొక్కుతారా?

విద్యాసంస్థల సర్క్యులర్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం
వర్సిటీల హెచ్చరికలపై మండిపడిన కాంగ్రెస్ అగ్రనేత
ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారంటూ విమర్శలు
సమయం వచ్చినప్పుడు జవాబుదారీగా ఉండాలని హెచ్చరిక
జంతర్ మంతర్ ఆందోళనలపై నిషేధం విధించిన విద్యాసంస్థలు
సోషల్ మీడియా పోస్టులపై డీయూ, జేఎన్‌యూల ఆంక్షలు
తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్న ఎంపీ హుడా
మౌనం వహిస్తే దేశం ముందుకు వెళ్లదన్న సీజేపీ
హక్కులకు మద్దతుగా నిలవాలని పూజా భట్ పిలుపు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** నీట్ ః పేపర్ లీకేజీకి నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ మిగతా 2లో..



## సింగరేణి విస్తరణకు సంపూర్ణ మద్దతు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** సింగరేణి సంస్థను ప్రపంచ స్థాయిలో పోటీపడే వ్యాపార దిగ్గజంగా తీర్చిదిద్దడానికి మరియు పరిరక్షించడానికి మిగతా 2లో..

గ్లోబల్ సంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం అండదండలు
భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్పులు
బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా విస్తరణ
అరుదైన ఖనిజాల ఉత్పాదనపై దృష్టి సారించాలి
కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష
సింగరేణి, జెన్‌కో అధికారులతో కీలక భేటీ
ప్రైవేటీకరణ సవాళ్లను ఎదుర్కోవాలని సూచన
నాణ్యత, పారదర్శకతతోనే పోటీలో విజయమన్న భట్టి
గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు



## గుజరాత్‌ను ముంచెత్తిన వరద

అసోం, జమ్ముకశ్మీర్‌లలో
కొనసాగుతున్న ఉధృతి
వందలాది మంది సురక్షిత
ప్రాంతాలకు తరలింపు
వల్సాడ్ జిల్లాలో పడవలు,
హెలికాప్టర్లతో సహాయక చర్యలు
నవసారి జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ
వరద నీటి నుంచి 67 మంది
గ్రామీణుల సురక్షిత తరలింపు
సురేంద్రనగర్ జలదిగ్బంధం
డిప్యూటీ సీఎం సమీక్ష
లఖ్తర్ తాలూకాలో 27 మందిని
కాపాడిన అధికారులు
అసోంలో తీవ్రరూపం దాల్చిన వరదలు
ఇప్పటివరకు 47 మంది ప్రాణాలు బలి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్రమైన వరద బీభత్సం నెలకొంది. ప్రత్యేకించి వల్సాడ్ జిల్లాలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడంతో స్థానిక యంత్రాంగం రెస్క్యూ చర్యలను ముమ్మరం చేసింది. వాపి సిటీ రెవెన్యూ అధికారి కాంతిభాయ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. నీటిలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు పడవలతో పాటు కొన్ని అత్యవసర ప్రాంతాల్లో హెలికాప్టర్లను కూడా ఉపయోగిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, స్థానిక విపత్తు స్పందన దళాలు బాధితులకు ఆహారం, తాగునీరు మరియు ప్రాథమిక వైద్య సదుపాయాలు అందిస్తున్నాయి. నవసారి జిల్లా సరిఖురాద్ గ్రామం ఆకస్మిక వరద నీటిలో చిక్కుకుపోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ 6వ బెటాలియన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు మిగతా 2లో..

## దూర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు వద్దు

జనావాసాల్లోనే
నిర్మించాలని సీఎం ఆదేశం
ఉపాధికి దూరం
కాకూడదన్న రేవంత్
నిరుపయోగ భూముల
గుర్తింపునకు సూచన
17 నియోజకవర్గాల్లో
7,680 ప్లాట్లు
రూ.5 లక్షల సబ్సిడీ
ఇవ్వనున్న ప్రభుత్వం
పనులు వేగవంతం చేయాలని
అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలోని నిరుపయోగ భూములను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ గృహాలపై శుక్రవారం జరిగిన సమీక్షలో సీఎం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన వినియోగంలో లేని స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ఆయా శాఖలకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించి, ఆ స్థలాలను గృహ నిర్మాణానికి మిగతా 2లో..



## హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ ఉద్రిక్తం

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
రాహుల్ గాంధీపై దాడి, విద్యార్థుల అరెస్టులను ఖండించిన నేతలు
హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు భారీ ర్యాలీ నిర్వహణ
కాంగ్రెస్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారంటూ మండిపాటు
ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..
కాంగ్రెస్ కార్యకర్తలతో తీవ్ర తోపులాట

02



# గుజరాత్‌ను ముంచెత్తిన వరద

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. బాధితుల్లో ఉన్న 25 మంది మహిళలు, 22 మంది చిన్నారులతో సహా మొత్తం 67 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారేమోనన్న అనుమానంతో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

సురేంద్రనగర్ జిల్లా లఖ్తర్ తాలూకాలోని ఓలాక్ గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు జలదిగ్బంధంలో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన జిల్లా యంత్రాంగం, పోలీసు మరియు అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 27 మందిని కాపాడారు. రాష్ట్రంలో ఉత్పన్నమైన ఈ అత్యవసర పరిస్థితులపై గుజరాత్ డిప్యూటీ సీఎం ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మరోవైపు ఈశాన్య రాష్ట్రమైన అసోంలో వరద పరిస్థితి అత్యంత భయానకంగా మారింది. నిరంతరం కురుస్తున్న వర్షాల ధాటికి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో అనేక ప్రాంతాలు నీటమునిగాయి. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించిన అధికారిక గణాంకాల ప్రకారం, ఈ వరద విపత్తు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 47 మంది మరణించారు. దాంతో బాధితులను రక్షించేందుకు రెస్క్యూ బృందాలు శ్రమిస్తున్నాయి.అసోం రాజధాని గువాహటిలోని హాటిగావ్, అనిల్ నగర్, బెల్టోల వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. మోకాళ్ల లోతు నీరు చేరడంతో వందలాది ఇళ్లు, దుకాణాలు, పాఠశాలల్లోకి వరద నీరు చేరింది. రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి జనజీవనం పూర్తిగా స్తంభించింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కామ్రూప్ మెట్రో జిల్లా యంత్రాంగం గువాహటిలోని అన్ని విద్యాసంస్థలకు ముందస్తు సెలవులను ప్రకటించింది.

రాబోయే రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. వరద పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు ప్రభావిత జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, ఉన్నతాధికారులతో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం హిమంత బిశ్వశర్మ ప్రత్యేక సమావేశం కానున్నారు.

ఉత్తరాదిన జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని కూడా వర్షాలు విపరీతంగా ముంచెత్తుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఉధంపూర్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఒక్కసారిగా ఆకస్మిక వరదలు పారాయి. దీని ప్రభావంతో పలు నివాస గృహాలు పాక్షికంగా దెబ్బతినగా, వ్యవసాయ పంటలు నీట మునిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ముందస్తు జాగ్రత్త చర్యగా బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఉధంపూర్ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదల్లో ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాకపోవడం ఊరటనిచ్చే అంశం. అయితే, వరదలు మరియు కొండచరియలు విరిగిపడటం వల్ల ఆస్తిపాస్తులు, పంటలకు జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో అంచనా వేస్తున్నారు. వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉన్నందున కొండ ప్రాంతాల ప్రజలు మరియు నదీ పరివాహక ప్రాంతాల నివాసితులు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ దళాలు హెచ్చరించాయి.

# లిఖిత పూర్వక హామీ ఇచ్చాకే దీక్ష విరమించా

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, పరీక్షల నిర్వహణలో అక్రమాలపై ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఎట్టకేలకు ముగిసింది. గత 26 రోజులుగా నిరసన తెలుపుతున్న ఆయన, కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత తన దీక్షను విరమించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌ల సమక్షంలో సోనమ్ వాంగ్‌చుక్ నిమ్మరసం తాగి దీక్ష ముగించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రత్యేక సందేశాన్ని పంపారు. వైద్యుల సూచనలు పాటించి సోనమ్‌జీ వేగంగా కోలుకోవాలని, వీలైనంత త్వరగా ఆయన బరువు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

దీక్ష విరమణ అనంతరం శుక్రవారం ఉదయం సోనమ్ వాంగ్‌చుక్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన లిఖితపూర్వక హామీ వచ్చినందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం మరియు విద్యా వ్యవస్థలో విస్తృత స్థాయి సంస్కరణలపై రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో సమగ్రంగా చర్చిస్తామని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని చెప్పారు. అలాగే శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని, ఈ పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటామని కూడా ప్రభుత్వం మాట ఇచ్చిందని సోనమ్ వివరించారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమణపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి దేశాన్ని మేల్కొలిపినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అయితే నీట్ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ పోరాటం ఆగదని దీప్కే స్పష్టం చేశారు. మరోవైపు పేపర్ లీక్‌లకు చెక్ పెడుతూ కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ అర్ధరాత్రి విడుదల చేసిన వీడియోపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మన విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతున్నారని, ప్రధాని ఇలాంటి వీడియోలతో వారిని అవమానించకూడదని రాహుల్ విమర్శించారు. ప్రభుత్వం వెంటనే యువతకు క్షమాపణ చెప్పాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దౌర్జన్యాలకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు షాక్..

మొదటిపేజీ తరువాయి




తరఫున అడ్వకేట్ జనరల్ (AG) సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ వైఖరిపై న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది.

**హైడ్రా తీరుపై ఘాటు వ్యాఖ్యలు**

విచారణ సమయంలో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "రెవెన్యూ, నీటిపారుదల (ఇరిగేషన్) చట్టాలను పక్కనబెట్టి కేవలం హైడ్రా చట్టం ఒక్కటే ఉందా?" అని న్యాయస్థానం ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చే ఆదేశాలను ఉల్లంఘించడం హైడ్రాకు ఒక అలవాటుగా మారిపోయిందని ధర్మాసనం మండిపడింది. ఒకే భూమికి సంబంధించి మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లలో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడం అనేది కోర్టు చరిత్రలోనే మునుపెన్నడూ లేదని స్పష్టం చేసింది.

**కోర్టు ఆదేశాలు లెక్కచేయకపోవడం తీవ్ర నేరం**

కోర్టు ధిక్కరణ ఉత్తర్వులపై ఉన్నత స్థానాల్లో అప్పీలు చేయకుండా, మళ్లీ అదే భూమిలోకి వెళ్లడం తీవ్రమైన నేరమని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేవలం ఒక సాధారణ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని, న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను సైతం లెక్కచేయకుండా లోతుకుంట భూముల్లోకి ఎలా వెళ్తారని హైడ్రా అధికారులను ప్రశ్నించింది.

**కమిషనర్ క్షమాపణలతో అఫిడవిట్ దాఖలుకు ఆదేశం**

ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసేందుకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టును సమయం కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా క్షమాపణలు తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

# సింగరేణి విస్తరణకు సంపూర్ణ మద్దతు




మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వ తలుపులు నిరంతరం తెరిచే ఉంటాయని హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, అందుకు తగ్గట్లుగానే సింగరేణి కూడా తన వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో ఇంధన రంగంలో ఊహించని మార్పులు రాబోతున్నాయని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్, పవన విద్యుత్, హైడ్రోజన్ మరియు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో థర్మల్ విద్యుత్ మరియు బొగ్గుపై ఆధారపడటం క్రమంగా తగ్గుతుందన్నారు. అందుకే సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా, అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్) తవ్వకాల్లోకి అత్యంత క్రియాశీలకంగా అడుగుపెట్టాలని సూచించారు.

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం సింగరేణి మరియు జెన్‌కో ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ ఉత్పత్తి, భవిష్యత్ ప్రణాళికలు మరియు సవాళ్లపై సమగ్రంగా చర్చించారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాష్ సహా ఇతర ముఖ్య అధికారులు ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు.

సింగరేణిని తెలంగాణ రాష్ట్రానికి ఆత్మగా అభివర్ణించిన ఉప ముఖ్యమంత్రి, 130 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ విద్యా, పారిశ్రామిక నిలయం రాష్ట్ర అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషించిందని అన్నారు. సింగరేణి నిరంతర ఎదుగుదలకు, సుస్థిరతకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఇది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదని, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న జీవనాడి అని వ్యాఖ్యానించారు.

ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తిలో సింగరేణికి ఏకఛత్రాధిపత్యం ఉండేదని, అయితే ప్రైవేటీకరణ విస్తరణతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేసే విధానం తీసుకురావడంతో ప్రైవేట్ సంస్థలు రంగంలోకి దిగాయని, దీంతో ప్రభుత్వ రంగ సంస్థలు పోటీని ఎదుర్కొక తప్పడం లేదన్నారు. బొగ్గు నాణ్యతను పెంచడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం మరియు సమర్థవంతమైన సేవలందించడం ద్వారానే ప్రైవేట్ కంపెనీలపై విజయం సాధించగలమని స్పష్టం చేశారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి దీర్ఘకాలిక ఆలోచన, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్లే బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనక సింగరేణి నూతన వనరులను కోల్పోయిందని డిప్యూటీ సీఎం విమర్శించారు. భద్రాద్రి, యాదాద్రి వంటి భారీ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు సరైన ప్రణాళికలు రూపొందించడంలో మరియు వాటికి అవసరమైన బొగ్గు బ్లాకులను సాధించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఒడిశాలోని నైని బ్లాక్, రాష్ట్రంలోని తాడిచర్ల 2 ప్రాజెక్టుల భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని చెప్పారు. సెమీకండక్టర్లు, మైక్రోచిప్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి అత్యంత కీలకమైన లిథియం, కోబాల్ట్ వంటి క్రిటికల్ మినరల్స్ తవ్వకాల్లోకి సింగరేణి విస్తరించాలని ప్రతిపాదించారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి విదేశాల్లో జరిగే క్రిటికల్ మినరల్స్ బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనాలని సూచించారు. సింగరేణి వద్ద దశాబ్దాల గనుల తవ్వకాల అనుభవం, అత్యుత్తమ ఇంజనీర్లు, అనుభవజ్ఞులైన సిబ్బంది ఉన్నారని, ఈ మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల కోసం ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

సింగరేణి డైరెక్టర్ల బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకూడదని, రాబోయే 10 సంవత్సరాల సమగ్ర రోడ్‌మ్యాప్ మరియు విస్తరణ వ్యూహాలపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. నిబంధనలతో కూడిన క్యాలెండర్‌ను రూపొందించి కార్పొరేట్ శైలిలో నిర్ణీత గడువుల్లోగా లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి గని వద్ద యాజమాన్యం, ట్రేడ్ యూనియన్లు కార్మికులతో బహిరంగ చర్చలు జరిపి, వారి సూచనలు స్వీకరిస్తూ కార్మికులను సంస్థ భవిష్యత్తులో భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు.

# విద్యార్థుల నోళ్లు నొక్కుతారా?

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అక్రమాలు, తప్పులను ప్రశ్నించడానికి విద్యార్థులు తమకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటిది విద్యార్థులను ఆందోళనల్లో పాల్గొనవద్దని హెచ్చరించడానికి యాజమాన్యాలకు ఎంత ధైర్యమని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు విద్యార్థుల హక్కులను కాలరాసేలా వ్యవహరించిన ఆయా విశ్వవిద్యాలయాలు ఖచ్చితంగా జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందని హెచ్చరించారు.

జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ఆందోళనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, కాబట్టి విద్యార్థులెవరూ ఆ ప్రాంతానికి వెళ్లవద్దని ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఐఐటీ రూర్కీ, ఐఐటీ మద్రాస్ సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు తమ విద్యార్థులకు ప్రత్యేక సర్క్యులర్‌లు జారీ చేశాయి. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా ఈ నిరసనలకు మద్దతుగా ఎలాంటి పోస్టులు పెట్టకూడదని ఆంక్షలు విధించాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే ఈ ప్రకటనలు విడుదల చేశామని విద్యాసంస్థలు స్పష్టం చేయగా, దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విశ్వవిద్యాలయాలు విడుదల చేసిన ఈ వివాదాస్పద సర్క్యులర్‌పై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా తీవ్రంగా స్పందించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా, ఒక పార్లమెంట్ సభ్యుడిగా డీయూ జారీ చేసిన ప్రకటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలపడం చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి సున్నితమైన విషయాల్లో యాజమాన్యాలు తప్పుడు ప్రచారాలు చేయడం నిజంగా సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

మరోవైపు నటి, చిత్రనిర్మాత పూజా భట్ కూడా వర్సిటీల వైఖరిని ఎండగట్టారు. విద్యార్థుల గొంతులను అణచివేయడం వల్ల వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పుడు మౌనం వహిస్తే సమాజం ఇంకెప్పటికీ ముందుకు వెళ్లలేదని సీజేపీ వ్యాఖ్యానించగా, విద్యార్థుల భవిష్యత్తుపై నిజంగా ఆందోళన ఉంటే మౌనంగా ఉండకుండా వారి ప్రజాస్వామ్య హక్కులకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పూజా భట్ పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ ఉద్రిక్తం

- **కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం**
- **రాహుల్ గాంధీపై దాడి, విద్యార్థుల అరెస్టులను ఖండించిన నేతలు**
- **హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు భారీ ర్యాలీ నిర్వహణ**
- **కాంగ్రెస్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**
- **విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారంటూ మండిపాటు**
- **ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..**
- **కాంగ్రెస్ కార్యకర్తలతో తీవ్ర తోపులాట**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై జరిగిన దాడితో పాటు, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీ ఛార్జ్, అరెస్టులను ఖండిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను తెలిపారు. హిమాయత్‌నగర్ కూడలి మరియు వై జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు కొనసాగింది.



ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. నీట్ (NEET) పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మరియు జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను కూడా భద్రంగా కాపాడలేని నాయకులు, ఇక ఈ దేశాన్ని ఎలా కాపాడుతారని ఆయన నిలదీశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని పట్టుబట్టారు.

ర్యాలీ హైదర్‌గూడ వద్దకు చేరుకోగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించారు. అయితే పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కాయి. పోలీసులు మరియు కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరగడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

# నీట్ లీకేజీపై బీఆర్ఎస్ సమరశంఖం

మొదటిపేజీ తరువాయి




ఉంటూ నల్ల చొక్కా ధరించి నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం నేరుగా ధర్నా స్థలానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. కేటీఆర్ రాకతో ధర్నా చౌక్ పరిసరాలు విద్యార్థుల నినాదాలతో హోరెత్తాయి.

ధర్నాలో మాట్లాడిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల ఎంతోమంది అర్హులైన విద్యార్థుల కష్టం బూడిదలో పోసిన పన్నీరైందని, దీనికి కేంద్ర పాలకులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.దేశ రాజధాని ఢిల్లీలో న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ప్రయోగించిన బలాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై పోలీసుల జులుం నశించాలని, వారిపై సాగుతున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి వారిపై లాఠీఛార్జీలు, అరెస్టులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. "ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులు చూస్తుంటే చాలా బాధగా ఉంది. కళ్లలో నీళ్లొస్తున్నాయి. విద్యార్థులేమైనా మోదీ, అమిత్ షాల కుర్చీలు అడిగారా? లేక రాజీనామాలు చేసి ప్రభుత్వాన్ని అప్పగించమన్నారా? కేవలం తమకు జరిగిన అన్యాయంపై శాంతియుతంగా న్యాయం మాత్రమే అడిగారు" అని కేటీఆర్ ప్రశ్నించారు. యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దని పాలకులకు హితవు పలికారు. ఇది భయపడే జనరేషన్ కాదని, పాలకులనే భయపెట్టే జనరేషన్ అని హెచ్చరించారు. ఇటీవల యువత ఆగ్రహానికి గురై నేపాల్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు ఎలా కుప్పకూలాయో కేంద్రం గుర్తుంచుకోవాలని సూచించారు.గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మరియు కేంద్రంలో ఉన్న పాలకుల మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు కూడా విద్యార్థుల భవిష్యత్తు కోసం, వారి న్యాయమైన హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వ అరాచకాలను గట్టిగా ఎండగడతామని స్పష్టం చేశారు. ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, విద్యార్థుల పక్షాన ఢిల్లీ పాలకులపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. తాము కేంద్ర ప్రభుత్వ తప్పులను, వినాశకర విధానాలను ఎండగట్టేందుకు నిరసన తెలుపుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు భయంగా ఉందని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు యూత్ కాంగ్రెస్ యత్నించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా చేసే పోరాటానికి మద్దతు ఇవ్వాల్సింది పోయి అడ్డుపడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమన్నారు.నీట్ లీకేజీ బాధితులకు పూర్తిగా న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతుందని కేటీఆర్ పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా యువత అంతా ఒకే తాటిపైకి వచ్చి కదం తొక్కుతోందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే ఏ ప్రభుత్వమైనా పతనం కాక తప్పదని హెచ్చరిస్తూ, ప్రతి విద్యార్థికీ ఇన్సాఫ్ లభించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ప్రధాన నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు.

# దూర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు వద్దు

మొదటిపేజీ తరువాయి



వినియోగించాలని చెప్పారు.

జనావాసాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే లబ్ధిదారులు వాటిలో నివసించే పరిస్థితి ఉండదని, జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అందువల్ల పని ప్రదేశాలకు సమీపంలోనే గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్కో ఫ్లాట్‌ను 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనుండగా, నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు అవుతుంది. ఇందులో రూ.5 లక్షల సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుండగా, మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. భూమి వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి తదితర 17 నియోజకవర్గాల్లో ఈ గృహాల నిర్మాణం చేపట్టనున్నారు. సంబంధిత ప్రాంతాల్లో నిరుపయోగ ప్రభుత్వ భూముల గుర్తింపును వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## కల్లుగీత కార్మికుల హక్కులకై జరిగే గీతన్నల చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయండి.

- గాజుల ఆంజనేయులు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు.



**వలిగొండ జులై 24(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ సమావేశం కూనూరు మల్లేశం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గాజుల ఆంజనేయులు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై ఆగస్టు 2 నుండి 18 వరకు మానుకోట నుండి ట్యాంక్ బండ్ వరకు కల్లుగీత అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర కొనసాగుతుందని ఆ దిశలో భాగంగా ఆగస్టు 9 ఆదివారం రామన్నపేటకు వస్తున్న బస్సు యాత్ర బృందానికి స్వాగతం పలుకుతూ జయప్రదం చేయాలని కోరుతూ బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు., కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, గీత కార్మికులకు ప్రభుత్వ బీమా కల్పించాలని, ప్రమాదంలో మరణించిన గీత కార్మికునికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆసరా పెన్షన్ 4000, వికలాంగులు అయిన కార్మికునికి 6 వేల రూపాయలకు పెంచి పెన్షన్ ఇవ్వాలని, వృత్తి సామాగ్రి, భద్రత సామాగ్రి మరియు ద్విచక్రవాహనం ఉచితంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర రవీందర్,జిల్లా సహాయ కార్యదర్శి బావండ్లపల్లి బాలరాజు,జిల్లా కమిటీ సభ్యులు కూనూరు మల్లేశం, మునికుంట్ల లెనిన్,మండల కమిటీ సభ్యులు పబ్బు సత్తయ్య,పబ్బు వెంకన్న,పబ్బు శేఖర్,గంగాదేవి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం:ఎమ్మెల్యే కేపీ

- మైత్రి నగర్ అభివృద్ధి దిశగా తొలి అడుగు
- కొత్త కమిటీతో కొత్త ఆశలు..అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ

**కుత్బుల్లాపూర్,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

మైత్రి నగర్ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో పూర్తి సహకారం అందిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హామీ ఇచ్చారు. మైత్రి నగర్ నూతన కమిటీ సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతం, ప్రజలకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలపై కమిటీ సభ్యులు ఎమ్మెల్యేతో చర్చించారు. సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ దశల వారీగా అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలతో సమన్వయం పెంచుకుని కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మైత్రి నగర్ అధ్యక్షుడు గట్టు అశోక్,జనరల్ సెక్రటరీ కృష్ణ,ట్రెజరర్ ఆంజనేయులు,వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, హరి నాయుడు, అడ్వైజర్లు లక్ష్మణ్,వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు,స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఖరి మార్చుకోవాలి: షాబాద్ బీజేపీ

- ప్రధాని నివాసం ముట్టడి ప్రజాస్వామ్య విరుద్ధమంటూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం

**షాబాద్,జూలై 24(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఆ పార్టీ తన వైఖరిని మార్చుకోవాలని షాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు మద్దూరి మానయ్య అన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నివాసాన్ని కాంగ్రెస్ నాయకులు ముట్టడించిన ఘటనను నిరసిస్తూ శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని షాద్‌నగర్-కంది జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఈ సందర్భంగా మద్దూరి మానయ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు తెలియజేయడానికి అనేక మార్గాలు ఉన్నప్పటికీ ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం సరైన విధానం కాదని విమర్శించారు. తాము దశాబ్దాల పాటు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఇలాంటి చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతమైన రాజకీయాలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కూతురు మహేందర్,లంబడి రాము, లంబడి కిరణ్ కుమార్,రాజీవ్ రెడ్డి,గూడెపు రమేష్,లింగాల మహేందర్,సందీప్ కుమార్ గౌడ్,రవీందర్ గౌడ్,దాదే మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# నీట్ యుజీ లీకేజీ రచ్చ

- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుపడుతున్న విపక్షాలు
- నాలుగో రోజూ పార్లమెంట్ మకరద్వారం వద్ద విపక్ష ఎంపీల నిరసన
- పరస్పరం విమర్శలు గుప్పించుకున్న అధికార, ప్రతిపక్షాలు
- యువత భవిష్యత్తుపై కాంగ్రెస్ మూడు ప్రధాన డిమాండ్లు
- ప్రధాని మోదీ సభలోనే ప్రకటన చేయాలని ఖర్గే స్పష్టం
- ప్రధాని ఫాస్ట్ ట్రాక్ కోర్టుల హామీ అసత్యమైనది
- ఆప్ అధినేత కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్ ప్రజాక్షేత్రం**

దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్ యుజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ విపక్ష ఎంపీలు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని మకరద్వారం వద్ద విపక్ష కూటమి ఎంపీలు వరుసగా నాలుగో రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ప్లకార్డులు మరియు బ్యానర్లను ప్రదర్శించారు.

పార్లమెంట్ పరిసరాల్లో నిరసనల వేడి తీవ్రస్థాయికి చేరింది. ఒకవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు మంత్రి రాజీనామాకు పట్టుబడుతుండగా, మరోవైపు అధికార ఎన్‌డీఏ ఎంపీలు కూడా పోటీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. నీట్ లీకేజీ అంశంపై సభలో నిర్మాణాత్మక చర్చ జరగకుండా విపక్షాలు ఉద్దేశపూర్వకంగా సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నాయని అధికార పక్షం ఆరోపించగా, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వం బాధ్యత వహించే వరకు వదిలేదే లేదని విపక్షాలు స్పష్టం చేశాయి. నీట్ లీకేజీ సంక్షోభంపై కాంగ్రెస్ పార్టీ తమ మూడు ప్రధాన డిమాండ్లను సామాజిక మాధ్యమం ద్వారా దేశ ప్రజల ముందుకు తెచ్చింది. మొదటిది విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, రెండోది నిరసన తెలుపుతున్న విద్యార్థులపై హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మూడోది దేశ యువతకు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ కోరింది. అర్ధరాత్రి ప్రకటనలు జారీ చేయడం మాని, ప్రధాని నేరుగా పార్లమెంట్ సభ వేదికగానే ఈ అంశంపై మాట్లాడితేనే దానికి ప్రామాణికత ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. పేపర్ లీక్ చేసిన దోషులను శిక్షించేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వీడియో విడుదల చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల కోసం చట్టం తెస్తామని చెప్పిన ప్రధాని హామీలు ఎంత అసత్యమైనవో మరుసటి రోజే రుజువైందని ఎద్దేవా చేశారు. నిజంగా దోషులను శిక్షించే ఉద్దేశం ఉంటే క్షేత్రస్థాయిలో చర్యలు దానికి విరుద్ధంగా ఎందుకు ఉంటున్నాయని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

నీట్ 2024 పేపర్ లీక్ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ ముఖియాకు బెయిల్ లభించడాన్ని కేజ్రీవాల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖియాకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదని సీబీఐ కోర్టుకు తెలపడం వెనుక ఉన్న అంతరార్థం ఏంటని ఆయన నిలదీశారు. అసలు నీట్ పేపర్ లీక్ చేసింది సంజీవ్ ముఖియా కాకపోతే ఇంకెవరని ప్రశ్నించారు. కీలక నిందితులపై సరైన ఆధారాలు సమర్పించనప్పుడు ఇక ప్రతిపాదిత ఫాస్ట్ ట్రాక్ కోర్టుల వల్ల దేశానికి వచ్చే ప్రయోజనం ఏమిటని నిలదీస్తూ, ప్రభుత్వం పేపర్ లీక్ మాఫియాను కాపాడుతోందని ఆరోపించారు.

పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం నిరాటంకంగా సాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. 26 రోజులకు పైగా సాగిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమణపై ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, దేశానికి ఆయన ప్రాణం ఎంతో విలువైనదన్నారు. తమ డిమాండ్ల విషయంలో తగ్గేదే లేదని, మంత్రి రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ వేదికను వదిలి వెళ్లేది లేదని తెగేసి చెప్పారు.

కేంద్ర ప్రభుత్వంతో జరగబోయే చర్చలకు సంబంధించి తమ పార్టీ వైఖరిని సీజేపీ ప్రతినిధులు పునరుద్ఘాటించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు వచ్చినా చర్చలు కేవలం ఒక తటస్థ వేదికపైనే జరగాలని సీజేపీ అధికార ప్రతినిధి దీపక్ బలియాన్ స్పష్టం చేశారు. మరోవైపు, శుక్రవారం రాత్రి తమ పార్టీ కీలక బృంద సభ్యులను పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. తమను అరెస్టు చేసినప్పటికీ దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఈ ఉద్యమాన్ని ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

నీట్ లీకేజీ వివాదం కేవలం రాజధాని ఢిల్లీకే పరిమితం కాకుండా దక్షిణాదికీ వ్యాపించింది. తమిళనాడు రాజధాని చెన్నైలో నీట్ రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు శుక్రవారం బాలన్ ఇల్లం వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తమిళనాడు వ్యాప్తంగా నీట్ రద్దు డిమాండ్ మరోసారి తీవ్రరూపం దాల్చింది. దేశంలో యువత మేల్కొన్నారని, ఇకపై అబద్ధపు హామీలతో వారిని మోసం చేయడం సాధ్యం కాదని నేతలు హెచ్చరించారు.

## జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిలక రాజు ఎన్నిక

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలకు కృతజ్ఞతలు తెలిపిన గిలక రాజు



**శంషాబాద్ జులై 24(ప్రజాక్షేత్రం):**

రాజేంద్రనగర్ దేవరాజ్ భవన్‌లో గురువారం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మహాసభలో గిలక రాజును జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా గిలక రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలుతో పాటు జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ, సంఘం పట్ల విధేయుడిగా ఉంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. మహాసభలో పాల్గొన్న నాయకులు గిలక రాజుకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన సేవలు సంఘ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

## కొంపల్లి సర్కిల్‌లో 'అనుమతుల్లేని' షెడ్ల నిర్మాణాల హవా?

- దూలపల్లిలో అక్రమ షెడ్ దర్జా...టౌన్ ప్లానింగ్ మౌనమే అండా?
- ప్రభుత్వ ఆదాయానికి గండి...అక్రమ షెడ్లపై ఎవరి అండ?
- షెడ్ నిర్మాణం సాగుతుంటే...టౌన్ ప్లానింగ్ ఎక్కడ?

**కుత్బుల్లాపూర్,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లి చైనా బజార్‌లో రెవాక్ సిస్టమ్స్ కంపెనీ (డోర్ నెం.16939) సమీపంలో భారీ షెడ్ నిర్మాణం జోరుగా సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించలేదా? లేక గుర్తించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలపడుతున్నాయి.

నిర్మాణ అనుమతులు లేకుండా భారీ షెడ్లు నిర్మించబడితే ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, ఇతర ఆదాయాలకు గండి పడే అవకాశం ఉందని పట్టణాభివృద్ధి వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నిర్మాణానికి సంబంధించి అనుమతుల వివరాలను అధికారులు బహిర్గతం చేసి, నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటారా? లేక మౌనంగా వ్యవహరిస్తారా? అన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# చదువే ఉన్నతికి మార్గం

- ప్రతిభను ప్రోత్సహిస్తేనే సమాజ ప్రగతి
- డీఈవో యాదయ్య
- హరిజనవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతుల విద్యార్థులకు నగదు పురస్కారాలు

**వనపర్తి,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

పట్టణంలోని హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దుతుందని, నిరంతర కృషి, క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని, దృఢ సంకల్పంతో ఎంతటి ఉన్నత స్థాయికైనా ఎదగవచ్చని విద్యార్థులకు సూచించారు. చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులు, సమాజం అందించే ప్రోత్సాహం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపు, ఉత్తమ ఫలితాల సాధనలో ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు విశేష సహకారం అందించారని తెలిపారు.

అనంతరం మెడిసిన్ విద్యార్థిని కృతికకు దాత బాలవర్ధన్ రెడ్డి అందజేసిన రూ.50 వేల నగదు పురస్కారాన్ని, పదో తరగతి జిల్లా టాపర్ నజీరకు రూ.30 వేల నగదు బహుమతిని డీఈవో యాదయ్య అందజేశారు. అలాగే అత్యధిక మార్కులు సాధించిన ఆదిల్, భార్గవి, భానుప్రకాశ్, జయచంద్ర, జ్ఞానేశ్వరి విద్యార్థులకు దాతలు అందించిన రూ.1,000 చొప్పున నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాతలు గంధం మదన్,వాకిట రవికుమార్ (కౌన్సిలర్), అరవింద్‌లను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సూర చంద్రశేఖర్,గణేశ్ కుమార్, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, విశ్రాంత ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్ రెడ్డి ,శ్రీనివాసరావు, మహిపాల్ రెడ్డి,గంధం నాగరాజు,భోజరాజు,వెంకటేష్, విశ్వంబాబు,బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి..

- చౌదరిగూడ గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం.

**శంషాబాద్ జులై 24 (ప్రజాక్షేత్రం):**

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మొక్కల పెంపకానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చౌదరి గూడ గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగుడ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మానవాళి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందన్నారు. రాష్ట్రంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. మొక్కలు పెంచడంలో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు,బక్క రాజు, మామిళ్ళ సబిత,దేవేందర్, పెంటయ్య, కుమార్, మల్లేష్, తాళ్ల ప్రసాద్ గౌడ్,ముత్యాల్, పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# షాబాద్‌కు కొత్త ఎస్‌హెచ్‌వో... ప్రజలకు అందుబాటులో ఉంటాం: డి.కె. లక్ష్మీ రెడ్డి

- షాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతల స్వీకారం.. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం




**షాబాద్,జూలై 24(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్‌కు నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)గా డి.కె. లక్ష్మీ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం తన తొలి ప్రాధాన్యత అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

షాబాద్ మండల ప్రజలు ఎలాంటి సమస్యలైనా నిర్భయంగా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని, ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు–పోలీసుల మధ్య పరస్పర విశ్వాసం పెంపొందించే దిశగా కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు.

యువత చట్టాలను గౌరవిస్తూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించిన డి.కె. లక్ష్మీ రెడ్డి, ప్రజల సహకారంతోనే నేరరహిత, ప్రశాంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. షాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.

# ఘనంగా మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు.

**శంషాబాద్ జూలై 24 (ప్రజాక్షేత్రం):**

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర మాజీ ఐటీ మరియు మున్సిపల్ శాఖ మంత్రి వర్యులు మాన్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు 50 వ పుట్టిన రోజు వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం శంషాబాద్ మండలం పెద్ద తుప్రా గ్రామంలోని మరియా సదన్ వృద్ధాశ్రమం లో శంషాబాద్ మాజీ ఎంపీపీ వర్యులు శ్రీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ అధ్యర్యం ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి అక్కడి వృద్ధులకు బ్రేడ్ మరియు పండ్లు పంపకాలు చేసారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మరియా సదన్ లో ప్రతేక ప్రార్థనలు చేయించారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు మంచర్ల మోహన్ రావ్,ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా, ఉపాధక్షులు రాజశేఖర్ గౌడ్, పెద్ద తుప్రా సర్పంచ్ సుమలత రాజు యాదవ్,జుకల్ సర్పంచ్ ప్రసాద్ గౌడ్,గ్రామా కమిటీ అధ్యక్షులు దిద్యాల శశికాంత్,ఉపాధ్యక్షుడు రాజు, పిఎసిఎస్ డైరెక్టర్ దిద్యాల గౌతమ్,కుమార్ యాదవ్ వార్డ్ సభ్యులు నల్లోల అశోక్,దిద్యాల నరేష్,దిద్యాల సునీత రాజు,గ్రామస్థులు దాసు,విజయ్, చింటూ,అరవింద్,శివ,ప్రకాష్ , నగేష్,మహేష్,దాసు,సాయి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌కు గుడ్‌బై.. బీఆర్ఎస్‌లో చేరిక

- చిన్నగుంటపల్లి కార్యకర్తలకు కండువాలు కప్పిన నిరంజన్ రెడ్డి

**వనపర్తి,జులై 24 (ప్రజాక్షేత్రం):**

మండలంలోని చిన్నగుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పిమాజీ మంత్రి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాత, కొత్త నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# నందిగామ సీఐ వీరభద్రను సన్మానించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేత పెంజర్ల యాదయ్య

**మహేశ్వరం జూలై 24 (ప్రజాక్షేత్రం):**

నందిగామ పోలీస్ స్టేషన్‌లో సీఐ వీరభద్రను మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి,పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా సీఐ వీరభద్రకు శుభాకాంక్షలు తెలిపిన యాదయ్య,ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ,శాంతిభద్రతల పరిరక్షణలో మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.పోలీస్ శాఖ చేస్తున్న సేవలను అభినందిస్తూ,నందిగామ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# రూ.65 లక్షల విలువైన 236 మొబైళ్లు బాధితులకు అందజేత

- సీఈఐఆర్ సాయంతో రికవరీ చేసిన వనపర్తి పోలీసులు
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు 500 ఫోన్లు అప్పగింత.
- ఎస్పీ సునితారెడ్డి

**వనపర్తి,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.65 లక్షల విలువైన 236 మొబైల్ ఫోన్లను వనపర్తి జిల్లా పోలీసులు రికవరీ చేసి బాధితులకు శుక్రవారం తిరిగి అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మొబైల్ రికవరీ మేళాలో ఎస్పీ సునితారెడ్డి బాధితులకు మొబైళ్లను పంపిణీ చేశారు.

సీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు బృందాలు నెల రోజుల పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి మొబైళ్లను గుర్తించి రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం 500 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఫోన్‌లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, డిజిటల్ చెల్లింపుల యాప్‌లు ఉండటంతో ఆలస్యం చేయకుండా ఫోన్‌ను బ్లాక్ చేయించాలని తెలిపారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా విక్రేత నుంచి రసీదు తీసుకోవాలని, దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మొబైళ్లను తిరిగి అందుకోవడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసులకు, ఎస్పీ సునితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ రికవరీలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్, ప్రత్యేక బృందాల పోలీసు సిబ్బందికి ఎస్పీ నగదు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు,సీఐలు,పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# కోటగిరిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్లు పంపిణీ చేసిన బీ ఆర్ ఎస్ నాయకులు

**కోటగిరి,జులై24(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలు ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు .ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ మండల నాయకులు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు,రైతాంగం ఇక్కట్ల నేపథ్యంలో జన్మదిన వేడుకలను జరుపుకోకూడదని కేటీఆర్ నిర్ణయించారని అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై కొనసాగుతున్న ధమనకాండ ను నిరసిస్తూ జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలి అని ఆయన పిలుపునివ్వడంతో కేక్ కటింగ్,ర్యాలీలు,బహిరంగ సభలు వంటి కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. కేటీఆర్ ఆదేశాల మేరకు స్థానికంగా జన్మదిన వేడుకలను అట్టహాసంగా కాకుండా సేవా దృక్పథంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజులలో కేటీఆర్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు మోరే కిషన్, సమీర్, శంకర్ గౌడ్, దేవేందర్,కప్ప సంతోష్, నజీర్, పాషా,గంగ ప్రసాద్ గౌడ్,అరవింద్,గౌతమ్,వడ్ల ఉమా కాంత్,గగన్,మసూద్, వజర్,బేగరీ మారుతి, కన్నం సాయిలు,శివ తదితరులు పాల్గొన్నారు.



# ఉపముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యల్ని తీసుకువెళ్ళిన టిపిసిసి ప్రధానకార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్

**భద్రాచలం,జూలై24(ప్రజాక్షేత్రం):**

భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి, విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం, ఇసుక ర్యాంపుల నిర్వహణ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.అలాగే రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడేలా గిరిజన గ్రామాల్లో అవసరమైన ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భద్రాచలం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో పనిచేస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, రైతులకు అవసరమైన సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మృత్యువుతో పోరాడిన డ్రైవర్‌కు ప్రాణదాతగా బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు

- బోల్తాపడిన అశోక్ లేలాండ్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను స్వయంగా బయటకు తీసిన సర్పంచ్
- 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలింపు
- మానవసేవే మాధవసేవ'ను చేతల్లో చాటిన ప్రజాప్రతినిధి

**బూర్గంపాడు,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక-శ్రీరాంపురం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బూర్గంపాడు గ్రామ సర్పంచ్ మందా నాగరాజు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి ఓ డ్రైవర్ ప్రాణాలను కాపాడేందుకు సాహసోపేతంగా వ్యవహరించారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే స్పందించిన ఆయన, ప్రాణాలకు తెగించి వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు.స్థానికుల వివరాల ప్రకారం, వేగంగా వచ్చిన ఓ లారీ అశోక్ లేలాండ్ ట్రాలీని బలంగా ఢీకొట్టడంతో ట్రాలీ అదుపుతప్పి రోడ్డుపక్కకు బోల్తాపడింది.ప్రమాదం తీవ్రతకు ట్రాలీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు.క్లీనర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.అదే సమయంలో అక్కడికి చేరుకున్న బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు పరిస్థితిని అంచనా వేసి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ట్రాలీపైకి ఎక్కి స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీశారు.అనంతరం వెంటనే 108 అత్యవసర అంబులెన్స్‌కు సమాచారం అందించి,గాయపడిన డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ను భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు.సర్పంచ్ మందా నాగరాజు చూపిన సమయస్ఫూర్తి, ధైర్యం, మానవత్వాన్ని స్థానికులు కొనియాడారు. ప్రమాద స్థలంలో ఉన్న పలువురు, "సర్పంచ్ వెంటనే స్పందించకపోయి ఉంటే పరిస్థితి మరింత విషమంగా మారేదేమో" అని అభిప్రాయపడ్డారు.ఈ ఘటనతో "మానవసేవే మాధవ సేవ" అనే మాటను మందా నాగరాజు చేతల్లో నిరూపించారని ప్రజలు ప్రశంసించారు.ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా ఆపదలో అండగా నిలిచే వ్యక్తిగా ఆయన వ్యవహరించడం అందరి ప్రశంసలను అందుకుంది. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, గాయపడిన వారి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



# సారపాకలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**బూర్గంపాడు,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.సారపాక టౌన్ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు లభించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో అనుసంధానిస్తూ బూర్గంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




# బాలాపూర్ మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం.

**మహేశ్వరం జూలై24 (ప్రజాక్షేత్రం):**

కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షల నిర్వహణలో అవలంబిస్తున్న విధానానికి నిరసనగా శుక్రవారం బాలాపూర్ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ,పీవైఎల్ విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు.బడంగ్‌పేట్ పాలిటెక్నిక్,డిగ్రీ కళాశాలలతో పాటు బాలాపూర్,మీర్‌పేట్,నాదర్‌గుల్,బడంగ్‌పేట్ ప్రాంతాల్లోని ప్రభుత్వ,ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించి బంద్‌ను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాలాపూర్ మండల కార్యదర్శి దాసరి అరవింద్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్న లోపాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు కొల్లూరు భీమేష్ మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని,నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో నీట్‌తో పాటు ప్రభుత్వం నిర్వహించే అన్ని పోటీ పరీక్షలను ఎలాంటి లీకేజీలకు తావులేకుండా పారదర్శకంగా,పటిష్టమైన భద్రతా చర్యలతో నిర్వహించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ,పీవైఎల్ నాయకులు దాసరి అఖిల్,కిరణ్,మనోహర్,అక్కి,శివతో పాటు పెద్ద సంఖ్యలో పాలిటెక్నిక్,డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



## దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- **ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు**
- **ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెల్లంకి మహేష్**

**వలిగొండ జూలై 24(ప్రజాక్షేత్రం):**

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా, దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్టిఏ ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని, దేశంలో విద్యా కేంద్రీకరణ విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈరోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది

ఈ పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను బంద్ చేసి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వెల్లంకి మహేష్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని అన్నారు నీట్ పేపర్ లీకేజీ కారణంగా మనస్థాపానికి గురై మరణించినట్లు పేర్కొనబడుతున్న 20 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్ట పరిహారం అందించడంతో పాటు, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు సాయి, నాయకులు బత్తిని మధు, కార్తీక్,నాయకులు నాగిళ్ల కార్తీక్,చంద్ర,వరికుప్పల ఉదయ్,భువనగిరి సాయి మరియు ఏఐవైఎఫ్ మండల నాయకులు కనకపోయిన నందు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల సవరణలో శతశాతం..

- **తాటిపాముల బీఎల్‌వోలకు ఘన సన్మానం**
- **అంకితభావంతో విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లను అభినందించిన పలుస శంకర్ గౌడ్**

**వనపర్తి,జూలై 24 (ప్రజాక్షేత్రం):**

ఓటర్ల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని శతశాతం విజయవంతంగా పూర్తి చేసిన తాటిపాముల గ్రామ బీఎల్‌వోలైన అంగన్‌వాడీ ఉపాధ్యాయ యులు సంగీత, భారతి, చెనమ్మలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ గ్రామ పెద్దలతో కలిసి వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఓటర్ల సవరణ కార్యక్రమంలో బీఎల్‌వోలుగా పనిచేసిన అంగన్‌వాడీ టీచర్లు అంకితభావంతో ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించి, కార్యక్రమాన్ని దాదాపు వంద శాతం పూర్తి చేయడం ప్రశంసనీయమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

ప్రభుత్వం అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుమ్మరి ఆంజనేయులు, హేమసుందర్ రెడ్డి,బోయ శ్రీను, బొంబాయి రామన్న,బోయ కురుమన్న,వడ్డె యెంకన్న, హనుమంతు రెడ్డి,చంద్రయ్య, హరికృష్ణ,చక్రవర్తి,గంధం విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: ప్రత్యేకాధికారి జయశ్రీ

**మహేశ్వరం జూలై. 24 (ప్రజాక్షేత్రం):**

జల్‌పల్లి సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని ఎస్ఐఆర్ ప్రత్యేకాధికారి,జిల్లా ఉపాధి కల్పనా అధికారి జయశ్రీ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు సూపర్‌వైజర్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ప్రతి బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌ఓ) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు.షిఫ్ట్ అయిన,మరణించిన,వలస వెళ్లిన ఓటర్ల వివరాలను సంబంధిత బూత్ లెవెల్ ఏజెంట్ల సంతకాలతో ధ్రువీకరించాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని,అనర్హుల పేర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమోదు చేయరాదని స్పష్టం చేశారు. ఏఈఆర్ఓ,జల్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వెంకట్రామ్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు 70 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.మొత్తం 91,039 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 48,699 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ పూర్తి చేశామని,ఇది 53.49 శాతానికి సమానమని వెల్లడించారు.నిర్ణీత గడువులోగా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేస్తామని తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో 50 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తి చేయించిన సూపర్‌వైజర్లు సుధాకర్,శివకుమార్‌లను ప్రత్యేకాధికారి జయశ్రీ సత్కరించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.వినయ్ కుమార్,సూపర్‌వైజర్లు సత్యనారాయణ,ఆనంద్,శేషారావు,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలి టీఆర్పీ

- **కొప్పుల వెంకటేష్‌పై దాడిని ఖండిస్తూ గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**గంగాధర, జూలై 24(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పుల వెంకటేష్‌పై బీజేపీ నాయకులు దాడి చేశారంటూ టీఆర్పీ నేతలు గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, రాజకీయ భిన్నాభిప్రాయాలు సహజమేనని, వాటిని వ్యక్తిగత దాడులకు దారితీయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న టీఆర్పీ నాయకులను దాడులతో భయపెట్టలేరని, పార్టీ పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

యూట్యూబ్ వేదికగా టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిని ప్రశ్నించినందుకే కొప్పుల వెంకటేష్‌పై దాడి జరిగిందని ఆరోపించారు. ఘటనపై పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొప్పుల వెంకటేష్ మాట్లాడుతూ, తనపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని విమర్శించారు. ప్రజల తరపున ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై పోరాడటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోనని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు



తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ చాన్ పాషా, గంగాధర మండల అధ్యక్షుడు ముక్కెర గంగరాజు, యూత్ ప్రధాన కార్యదర్శి బండ గంగరాజు, కోడిమ్యాల మండల అధ్యక్షుడు దుబ్బాక అరుణ్ తదితరులు పాల్గొన్నారు.




## మా ఇండ్ల మధ్య శవాలను కాలుస్తారా... స్మశాన వాటికను ఎత్తివేయాలి

- **బడంగ్ పేట కాలనీవాసులు**

**మహేశ్వరం జూలై 24 (ప్రజాక్షేత్రం):**

బడంగ్ పేట కాలనీ కి కూతవేటు దూరంలో విశాలమైన స్మశాన వాటిక ఉండగా గత ప్రభుత్వంలో కేవలం బిల్లుల కోసమే వైకుంఠధామాల పేరిట స్మశాన వాటికలను నిర్మించింది. అందులో భాగంగా మా ఇండ్ల మధ్య ఖాళీగా ఉన్న పార్కు స్థలాన్ని స్మశాన వాటిక గా మార్చి కాలనీవాసులైన బడుగు బలహీన వర్గాల జీవించే హక్కును కాలరాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల మధ్య స్మశాన వాటిక ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని, రెక్కాడితే గాని డొక్కాడని పేద వర్గాలకు తీవ్ర మనోవేదనను కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మశాన వాటికను ఆనుకొని ఉన్న వారంతా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారు కావడంతో , కొంతమంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వాళ్ళు కావాలనే పార్కు స్థలాన్ని స్మశాన వాటికగా మార్చారని, దానివల్ల కాలనీ వాసులు తీవ్ర అనారోగ్యాల పాలు అవుతున్నారని, ఇండ్ల మధ్య శవాలను కాల్చడం వల్ల వచ్చే పొగ దూళి, బూడిద కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ ఇబ్బందులను ఎదుర్కొంటూ తరచుగా రోగాల బారిన పడుతు మరణిస్తున్నారని, కాలనీలో మరణాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని అంటున్నారు. తమ చావులకు కారణమవుతున్న స్మశాన వాటిక ను (వైకుంఠధామం) వెంటనే ఎత్తివేసి వారి ప్రాణాలకు రక్షణ కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత ప్రభుత్వంలోనే అనేకసార్లు పనులను కాలనీ వాసులు అడ్డుకున్న , కొంతమంది కావాలని శవాలను కాలనీ మధ్య గుండా తీసుకురావడం, కాలనీవాసులను రెచ్చగొట్టడం అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పార్కు స్థలాన్ని స్మశాన వాటికగా మార్చవలసిన అవసరం ఏముందని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంలో అనేకసార్లు జిహెచ్ఎంసి అధికారులను, కలెక్టర్ ను , స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇక్కడి నుండి స్మశాన వాటికను ఎత్తివేసి కాలనీ వాసుల జీవించే హక్కును కాపాడాలని కోరుతున్నారు. నిన్నటికి నిన్న స్మశాన వాటిక పనులను పునరుద్ధరణ కోసం వచ్చిన బుల్డోజర్ ని కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసుల కమిటీ నాయకురాలు జాంగ్రీ ఇందిరక్క తో పాటు కాలనీ మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు "హకీమ్ తాత" అభయహస్తం..!

- **కేటీఆర్ బర్త్ డే కానుకగా పోతంగల్ మండల ప్రజలకు తీపి కబురు**
- **తొలి కాన్పులో ఆడబిడ్డ పుడితే రూ.5వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటన**

**బాన్సువాడ,జులై 24(ప్రజాక్షేత్రం):**


కేటీఆర్ బర్త్ డే కానుకగా పోతంగల్ మండల ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నాయకుడు డాక్టర్. ఎంఏ.హకీమ్ తీపి కబురు చెప్పారు. ఇకపై పోతంగల్ మండలంలోని ఏ గ్రామంలో అయినా తొలి కాన్పులో ఆడబిడ్డ పుడితే హకీమ్ తాత తరఫున ఆ తల్లిదండ్రులకు 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. కేటీఆర్ బర్త్డే సందర్భంగా పోతంగల్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన... ఈ ప్రకటన చేశారు. ఆడబిడ్డలను భారంగా భావించే నేటి రోజుల్లో ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులకు అండగా నిలబడేందుకు తన వంతుగా 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఆడపిల్ల పుడితే ఇంటికి అదృష్టం అని సాక్షాత్తు లక్ష్మీదేవి ఇంటికి వచ్చినట్లుగా భావించాలని ఆయన సూచించారు. పుట్టిన ఆడపిల్లలకు హకీమ్ తాత కానుకగా తాను ఈ ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు చెప్పారు. ఇకపై మండలంలో ఏ గ్రామంలో అయినా సరే తొలి కాన్పులో ఆడపిల్ల పుడితే ఆ గ్రామాలలోని బిఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేటీఆర్ బర్త్డే సందర్భంగా మండలంలో పుట్టబోయే ఆడబిడ్డలకు అండగా నిలిచేందుకు హకీమ్ తాత అభయహస్తం ఇవ్వటం పై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




## ఆగస్టు 15లోగా విద్యార్థులకు యూనిఫాంలు

- **38,653 మంది విద్యార్థులకు రెండు జతల దుస్తులు**
- **ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు సూచనలు**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,జూలై 24 (ప్రజాక్షేత్రం):**




జిల్లాలోని ప్రభుత్వ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల, మోడల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆగస్టు 15లోగా మొదటి జత ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 512 పాఠశాలల్లో చదువుతున్న 38,653 మంది విద్యార్థులతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. బాలురకు లైట్ బ్లూ రంగు షర్టులు, డార్క్ బ్లూ రంగు ప్యాంట్లు, బాలికలకు నిర్ణీత నమూనాలో దుస్తులు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 358 మంది శిక్షణ పొందిన టైలర్ల ద్వారా యూనిఫాంల కుట్టింపు పనులు వేగంగా కొనసాగుతున్నాయని, రెండో జత దుస్తులను ఆగస్టు 25లోగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుతో నష్టపోకుండా నీటి లభ్యతను బట్టి కంది, నువ్వులు, వేరుశెనగ, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య,డీఆర్‌డీఓ ఉమాదేవి,జిల్లా వ్యవసాయాధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు బిడ్డనని నిరూపించుకున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రశంసలు

**నిర్మల్ జిల్లా జూలై 24(ప్రజాక్షేత్రం):**

కుబీర్ మండల కేంద్రంలో నిర్వహించిన జలసిరి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒక అపూర్వ ఘట్టం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తనదైన శైలిలో వ్యవహరించి అందరి దృష్టినీ ఆకర్షించారు. కేవలం వేదికలకే పరిమితం కాకుండా స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగి ఆయన చూపిన చొరవ అక్కడ ఉన్నవారందరినీ ఎంతగానో ఆకట్టుకుంది తాను ఒక సాధారణ రైతు బిడ్డననే విషయాన్ని గుర్తుచేసుకుంటూ, అదనపు కలెక్టర్ స్వయంగా చేతిలోకి గడ్డపార పట్టారు. ఏమాత్రం తటపటాయించకుండా ఎంతో వేగంగా, నైపుణ్యంతో ఆయన మట్టిని తవ్వుతుంటే అక్కడి వారంతా ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు. ఒక వైపు ఎండ తీవ్రత ఉన్నప్పటికీ, ఏమాత్రం అలసట లేకుండా సామాన్య శ్రమజీవిలా ఆయన పని చేసిన తీరు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను సైతం విశేషంగా అబ్బురపరిచింది.ఉన్నతమైన అధికార హోదాలో ఉండి కూడా ఎలాంటి బేషజాలు లేకుండా శ్రమను గౌరవిస్తూ ఆయన వ్యవహరించిన తీరుపై స్థానిక ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులతో మమేకమవుతూ ఆయన చూపిన ఈ చొరవ, నిబద్ధత ఇతర అధికారులకు, యువతకు ఎంతో ఆదర్శప్రాయంగా నిలిచాయని పలువురు కొనియాడారు. ఈ అరుదైన దృశ్యం జలసిరి కార్యక్రమానికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవడమే కాకుండా, పర్యావరణ, జల సంరక్షణ పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా స్ఫూర్తిని నింపింది.



V

# దాడులపై విచారణ జరపాలి!

- బంద్ సక్సెస్.. కేంద్ర మంత్రి రాజీనామాకు డిమాండ్
- ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రేశ్వంత్

మొయినాబాద్, జులై 24(ప్రజాక్షేత్రం):

నీట్ పేపర్ లీక్ వ్యవహారంతో తీవ్ర మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రేశ్వంత్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కనకమామిడి, అమ్దాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై జరిగిన దాడులపై తక్షణమే పారదర్శకంగా విచారణ జరిపించాలన్నారు.

నీట్ పేపర్ లీక్ వ్యవహారంతో తీవ్ర మనస్తాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విబిఎస్ఎ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నవీన్, సోనూ, వికాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.




# కేతిరెడ్డిపల్లిలో ప్రమాదాల నివారణకు రహదారి మరమ్మతులు

- ప్రయాణికుల రక్షణే ధ్యేయం: సర్పంచ్ యాదయ్య

మొయినాబాద్, జులై 24(ప్రజాక్షేత్రం):



రహదారిపై ప్రయాణించే వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపడుతున్నామని కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య తెలిపారు. శుక్రవారం గ్రామంలో చేపట్టిన రహదారి పనులను సర్పంచ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా రాకపోకలకు ఆటంకంగా మారిన పిచ్చి చెట్లను పూర్తిగా తొలగించడంతో పాటు ప్రమాదకర గుంతలను పూడ్చి సమతలం చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు జేసీబీల సహాయంతో ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల క్షేమం, ఊరి అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతామని సర్పంచ్ యాదయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# భైంసా ఏరియా ఆసుపత్రిని 150 పడకలుగా మారుస్తాం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నిర్మల్ జిల్లా జూలై 24(ప్రజాక్షేత్రం):



వర్షాకాలం నేపథ్యంలో ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం భైంసా ఏరియా ఆసుపత్రిలో సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్‌తో కలిసి ఆయన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అత్యవసర (ఎమర్జెన్సీ) కేసుల పట్ల వైద్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగానికి చెందిన వైద్యులతో వ్యక్తిగతంగా మాట్లాడి, అక్కడ ఉన్న సమస్యలను, కావాల్సిన వైద్య పరికరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని వసతులను త్వరలోనే సమకూరుస్తామని హామీ ఇచ్చారు ఏరియా ఆసుపత్రిని ప్రస్తుతమున్న 100 పడకల నుంచి 150 పడకల ఆసుపత్రిగా విస్తరించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వీటితో పాటు కుభీర్ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని, భైంసాలో ప్రత్యేకంగా ఒక మెటర్నటీ (ప్రసూతి) ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. త్వరలోనే జిల్లా ఇంచార్జ్ మంత్రితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, నియోజకవర్గ ఆరోగ్య రంగ సమస్యలన్నింటినీ వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణ ఫ్యూచర్ లీడర్ కేటీఆర్..!

- హైదరాబాద్ అభివృద్ధి చూస్తే కేటీఆర్ విజన్ ఏంటో తెలుస్తుంది
- కేటీఆర్ బర్త్ డే కానుకగా ఇకపై మండలంలో ఆడబిడ్డ పుడితే 5వేలు..!
- పోతంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు డాక్టర్. ఎంఏ.హకీమ్

కోటగిరి, జులై 24(ప్రజాక్షేత్రం):






తెలంగాణ రాష్ట్ర ఫ్యూచర్ లీడర్ కేటీఆర్ అని కేటీఆర్ బర్త్ డే కానుకగా ఇకపై పేద కుటుంబంలో మొదటి కాన్పులో ఆడపిల్ల జన్మిస్తే వారికి రూ.5వేలు నగదును హకీమ్ తాతయ్య కానుకగా ఇవ్వనున్నట్లు పోతంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.ఏ హకీమ్ మండల ప్రజలకు ప్రకటించారు. శుక్రవారం పోతంగల్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు, స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్, పాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం పోతంగల్ గ్రామానికి చెందిన కన్నం హన్మండ్లు కంటి ఆపరేషన్ చేయించుకుని నిస్సహాయస్థితిలో ఉండగా ఆయనకు ఎం.ఏ హకీమ్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ఎం.ఏ హకీమ్ మాట్లాడుతూ....రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు,దేశంలో నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం దృష్ట్యా జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలన్న కేటీఆర్ పిలుపుమేరకు పోతంగల్ మండల వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ముందుగా కేక్ కటింగ్,మహా అన్నదాన కార్యక్రమాలు అట్టహాసంగా చేయాలని అనుకున్నామని కేటీఆర్ ఆదేశాలతో వారి జన్మదిన వేడుకలను సాదాసీదాగా నిర్వహించాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలు, రైతులు, యువత భవిష్యత్తు లక్ష్యంగా పనిచేస్తున్న నిరాడంబర నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు.ఆయన అడుగు జాడల్లోనే తామందరం నడుస్తామని ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ లీడర్ కేటీఆర్ అని ఈ సందర్భంగా తెలిపారు. కేటీఆర్ ఎలాంటి నాయకుడో తెలియాలంటే ఒకసారి అందరూ హైదరాబాద్ అభివృద్ధిని చూడాలని కోరారు. కేటీఆర్ బర్త్డే కానుకగా ఇకపై పోతంగల్ మండలంలో మొదటి కాన్పులో పుట్టే ఆడబిడ్డకు హకీమ్ తాతయ్య తరఫున రూ.5000 రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూదం నవీన్, ఆరిఫ్, కోమటి గంగాధర్, దోమలెడ్గి ఉప సర్పంచ్ బీంరావు, హనుమంతు,సురేష్, పట్నం సాయిలు,బిక్యా నాయక్, రేణీ రాములు,ఉమర్ ఖాన్, ఆఫ్రాజ్, సూదం సాయిలు, ఇమ్రాన్, జలాల్, అవేస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



# అంత్యక్రియలకు రూ.20 వేల ఆర్థిక సహాయం

కోటగిరి,జులై 24(ప్రజాక్షేత్రం):

కోటగిరి మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన గొడుగు నారాయణ గురువారం మృతి చెందగా అంత్యక్రియలకు తేల్ల రవి అన్న యువసేన ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం అంత్యక్రియలకు హాజరై ఈ నగదును కుటుంబ సభ్యులకు అందించారు. గతంలో నారాయణ డ్రైవర్ గా సుదీర్ఘకాలం పాటు తమ వద్ద పనిచేయడంతో అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించామని భవిష్యత్తులో నారాయణ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తేల్ల అరవింద్, తేల్ల రవికుమార్, కప్ప సంతోష్, మామిడి అశోక్, గుడు, రహీం, మిట్టు, అమీ,ర్ కనిగిరి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# దేగాం గ్రామ పంచాయతీలో ముమ్మరంగా 'డ్రై డే కార్యక్రమం

నిర్మల్ జిల్లా జూలై 24(ప్రజాక్షేత్రం):



భైంసా మండలం దేగాం గ్రామ పంచాయతీలో డ్రై డే (పొడిదినం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అంటువ్యాధులు ప్రబలకుండా చూసేందుకు ఈ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు చుట్టుపక్కల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ఇళ్ల ముంగిట, ఖాళీ స్థలాల్లో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిల్వ ఉన్న నీటిలోనే డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు పెరుగుతాయని, కాబట్టి వారంలో ఒకరోజు తప్పనిసరిగా ఇళ్లలోని పాత సామాన్లు, టైర్లు, కూలర్లలోని నీటిని పారబోసి పొడిగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి పవార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వీధుల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ నీటి నిల్వలను పరిశీలించి, లార్వాలను గుర్తించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ పెద్ద బాయి మహిపాల్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ 50వ జన్మదిన వేడుకలను నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

-జహీరాబాద్ (ప్రజాక్షేత్రం)



# రహదారా మురికి కాలువనా కుబీర్ కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యపు పరాకాష్ట!

నిర్మల్ జిల్లా జూలై 24(ప్రజాక్షేత్రం):



కుబీర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారి చెరువును తలపిస్తున్నా. అధికారులు కళ్లున్నా కబోదుల్లా వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది.రహదారిపై మురుగు కాలువలుప్రధాన కూడలి గుంతలమయమై, బురద నీటితో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులు కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై నిరసన జ్వాలలుసమస్య తీవ్రతపై స్థానికులు, వాహనదారులు పలుమార్లు పంచాయతీ, ఆర్&బీ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారులు తూతూమంత్రంగా పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని జనం మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున రాస్తారోకోలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

చౌటుప్పల్, జూలై 24(ప్రజాక్షేత్రం):




కేటీఆర్ జన్మదిన వేడుకలు చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలో ఘనంగా సంబరాలు చేశారు చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ లో బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన సందర్భంగా పండ్లు బ్రెడ్ ఉచితంగా పంపిణీ చేశారు. కేటీఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా రాజకీయంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు సింగిల్ విండో చైర్మన చింతల్ దామోదర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకట్రెడ్డి, కౌన్సిలర్లు శేఖర్ గౌడ్, యాదయ్య ఢిల్లీ మాధవరెడ్డి, పరమేశ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, పర్వతాలు యాదవ్, శ్రీకాంత్ అత్తర్ పాషా, మెట్టు మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కీసర పీహెచ్‌సీపై డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ


కీసర, జూలై 24(ప్రజా క్షేత్రం):

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో గర్భిణీలకు అందుతున్న సేవలు, తల్లి-శిశు సంక్షేమ కార్యక్రమాలు, క్షయవ్యాధి నియంత్రణ చర్యలు, ఔషధాల లభ్యతపై సమీక్ష నిర్వహించారు.

గర్భిణీల నాలుగో ఏఎన్‌సీ (ఎ.యన్.సి) నమోదు రిజిస్టర్లను పరిశీలించిన ఆయన, వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతో పాటు ప్రతి గర్భిణీకి నిర్ణీత సమయానికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. నమోదైన ప్రతి కేసుపై క్రమం తప్పకుండా ఫాలోఅప్ నిర్వహించి తల్లి-శిశు ఆరోగ్య ఫలితాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

క్షయవ్యాధి (టీబీ) కార్యక్రమానికి సంబంధించిన సమ్మతి పత్రాలు, రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో, వాటిని సక్రమంగా నిర్వహించడంతో పాటు రోగులకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, వైద్యుల సూచనల మేరకు రోగులకు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని డా. కె. ఆనంద్ హెచ్చరించారు. ప్రజలకు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా ఆరోగ్య సేవలు అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని స్పష్టం చేశారు.



# అలంఖాన్ గూడ నీటి కష్టాలు...

- గ్రామంలో ఉండాల్సిన సర్పంచ్ గ్రామం బయట ఉండడమేంటి..?
- కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వస్తే మా కష్టాలు తీరుతాయి అనుకోని మేము ఓటు వేశాము.
- కానీ కష్టాలు వస్తాయని మేము ఊహించలేము...
- గ్రామస్తులు దమ్మన్నగారి శివకుమార్ రెడ్డి

**శంకర్ పల్లి జులై 24(ప్రజాక్షేత్రం):**




రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండల్ పరిధిలోని అలంఖాన్ గూడ గ్రామంలో నీటి కష్టాలు గత మూడు సంవత్సరాలుగా ఈ సమస్యతో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కూడా పరిష్కారం చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ కి ఫిర్యాదు చేద్దామని గ్రామ కార్యానికి వెళ్లి చూడగా గ్రామ సర్పంచ్ ఆఫీసుకు తాళం వేసి ఉన్నది. గ్రామంలో అందుబాటులో ఉండి గ్రామ సమస్యలు పరిష్కారం చేసే దిశగా ఉన్న గ్రామ సర్పంచ్ కార్యాలయానికి తాళం వేసి ఉంటే మరి గ్రామంలో ఉన్న సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో మరి. గ్రామంలో ఉన్న వారిని విచారణ చేయగా గ్రామ సర్పంచ్ మా గ్రామంలో ఉండదు సిటీలో మాత్రమే వుంటారు. మా గ్రామంలో ఏమైనా ఇంపార్టెంట్ ప్రోగ్రాం లు అయినప్పుడు మాత్రమే మా విలేజ్ కి వస్తూ వుంటారు అని గ్రామస్తులు తెలిపారు. మరి ఇప్పటికైనా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్పందిస్తారా మా సమస్యలపై లేక సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తారా..? గ్రామ ప్రజలు కట్టే టాక్స్ ల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై ఉన్నతాధికారులకు లేదా..? గత ప్రభుత్వంలో కేసీఆర్ ఆడపిల్లలు కష్టపడుతున్నారు బయటికి వెళ్లి బిందె తోటి నీళ్ళు మోసుకొచ్చే పరిస్థితి ఉన్నందువలన దానిని గమనించిన కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటి నల్ల పేరుతో మిషన్ భగీరథ నీరు ఏర్పాటు చేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో దానిని అమలు చేయకుండా వీళ్ళ ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఇప్పటికైనా ఉన్నంత అధికారులు స్పందిస్తారా లేక ప్రజలు ఇలాగే సమస్యతోటి బాధపడదలే అని ఎదురు చూస్తున్నారా..?



గ్రామ వాస్తవ్యులు దమ్మన్నగారి శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సమస్య ఇదేమీ మాకు కొత్త కాదు ఇంతకుముందున్న అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినం ఇప్పుడు కూడా వాట్సాప్ గ్రూప్ ద్వారా తీసుకెళ్తున్నాం అయినా కానీ మా సమస్యలు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఆనాడు ఇంటింటికి వచ్చి సర్పంచు వార్డు నెంబర్లు ఎలక్షన్ మూమెంట్లో ఇంటింటికి వచ్చి మీకు ఎటువంటి సమస్యలు ఉన్నా మేము వున్నాము ఏ సమస్య ఉన్న మీ ఇంటికి వస్తాం అన్నారు. కానీ ఈరోజు వార్డు నెంబర్లకు చెప్తే సర్పంచికి చెప్పాము అంటున్నారు కానీ సర్పంచి కూడా గ్రామంలో ఉండకపోవడం మాకు పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారం చేయండి లేదు అంటే మేము నేరుగా కలెక్టర్ దృష్టికి గాని రేవంత్ రెడ్డి దృష్టికి గాని తీసుకెళ్లి సమస్యను మేమే సాల్వ్ చేసుకునే దిశగా



పరిష్కారం చేస్తామని హెచ్చరించారు. మేము కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా కష్టాలు తీరుతాయని నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసాము కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వ మమ్మల్ని కష్టాల్లోకి తోస్తున్నది. మా సమస్యను పరిష్కరించకుంటే వచ్చే ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## భద్రాచలం అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి భవన్ ధర్మకర్త సభ్యుల ఎన్నిక

- **గోషిక వినయ్ కుమార్ చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్,బడుగు రవి కుమార్ ఏకగ్రీవ ఎన్నిక**
- **పద్మశాలి సమాజానికి గర్వకారణం**
- **సేవా భావంతో సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేస్తారంటూ హర్షం వ్యక్తం చేసిన పలువురు**




**చౌటుప్పల్, జూలై 24(ప్రజాక్షేత్రం):**

అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి భవన్, భద్రాచలం ధర్మకర్త సభ్యులుగా చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ప్రముఖ సామాజిక సేవకుడు బడుగు రవి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల పద్మశాలి సమాజ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఎన్నిక పద్మశాలి సమాజానికి దక్కిన గౌరవమని, సమాజ సేవ పట్ల వీరిద్దరికీ ఉన్న నిబద్ధత, ప్రజలతో ఉన్న అనుబంధానికి ఇది నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. భక్త మార్కండేయ మహర్షి ఆశీస్సులతో భద్రాచలం పద్మశాలి భవన్ మరింత అభివృద్ధి చెందే దిశగా వీరు సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గోషిక వినయ్ కుమార్ ప్రజాసేవలో తనదైన ముద్ర వేసుకుంటూ చౌటుప్పల్ పురపాలక వైస్ చైర్మన్‌గా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే బడుగు రవి కుమార్ కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ పద్మశాలి సమాజ ఐక్యతకు కృషి చేస్తున్నారని తెలిపారు.భక్త మార్కండేయ పద్మశాలి భవన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, యువతను సంఘ సేవ వైపు ప్రోత్సహించడం, సమాజ అభ్యున్నతికి దోహదపడే కార్యక్రమాలను చేపట్టడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి భవన్ దేశవ్యాప్తంగా పద్మశాలి సమాజ ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రబిందువుగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, నూతనంగా ధర్మకర్త సభ్యులుగా ఎన్నికైన గోషిక వినయ్ కుమార్, బడుగు రవి కుమార్ కి మరోసారి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి పదవీకాలంలో సంస్థ అభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహించి,సమాజానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.



## అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వైద్య విద్యార్థిని ఆత్మహత్య

**కీసర, జూలై 24(ప్రజా క్షేత్రం):**



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారంలో విషాదం చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి బెంగళూరులోని సిద్ధార్థ వైద్య కళాశాలలో పీజీ చదువుతున్న దీక్షిత (26) అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది.


పోలీసుల వివరాల ప్రకారం, గత వారం తల్లిదండ్రుల వద్దకు నాగారం వెస్ట్ గాంధీనగర్‌కు వచ్చిన దీక్షిత, గురువారం సాయంత్రం అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మైలారం గ్రామం కాగా, ప్రస్తుతం కుటుంబం నాగారంలో నివాసం ఉంటోంది. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రహరీ గోడ లేక అవస్థలు.

- **పట్టించుకోని విద్యాశాఖ ఉన్నత అధికారులు.**
- **రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుగా మారిన జిల్లా పరిషత్ హై స్కూల్**

**కామారెడ్డి జిల్లా జులై 24(ప్రజాక్షేత్రం):**

సదాశివనగర్ మండల్ భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు సంవత్సరాలుగా ప్రహరీ గోడ కూలిపోవడం జరిగింది. దీనితో పాఠశాల ఆవరణలోకి. విష పురుగులు పశువులు రావడంతో పాటు రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలకు సరైన రక్షణ లేకుండా పోయింది. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచుకోవడంతోపాటు సౌకర్యాల రక్షణ కోసం ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని ఆలోచన ఉన్న ప్రహరి గోడ లేకపోవడంతో పశువులు వచ్చే మేసే అవకాశం ఉందని వెనక్కి తగ్గుతున్నారు. గ్రామంలో ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాలలో వందలాదిమంది విద్యార్థులు చదువుకున్నప్పటికీ పాఠశాలకు రక్షణ కల్పించే ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 100% ఉత్తీర్ణత సాధించిన భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాల లో ప్రహరి గోడ లేకపోవడంతో పిల్లలకు ఏకాగ్రత లోపించడం బయట శబ్దాలు పరిసరాల వల్ల చదువుకు ఆటంకాలు కలిగే అవకాశాలు ఉన్నందున విష పురుగులు రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలు. పాలు పడకుండా ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం గురించి తరచూ హామీలు ఇస్తున్న ప్రజాప్రతినిధులు భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ సమస్యలను కూడా అత్యవసరముగా పరిగణించి నిధులు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




# వికారాబాద్‌లో ఉద్రిక్తత బీజేపీ, బీజేవైఎం నాయకుల అరెస్ట్!

**వికారాబాద్ జులై 24(ప్రజాక్షేత్రం):**

రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ఏబీవిపి,బీజేవైఎం, బిజెపి, నాయకుల ఆందోళన వికారాబాద్ బిజెఆర్ చౌరస్తాలో ధర్నా బిజెపి నాయకుల అరెస్ట్ వికారాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలింపు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా, బీజేవైఎం, ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ రెడ్డి, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, దేశ వ్యతిరేక శక్తులతో కాంగ్రెస్ పార్టీ చేతులు కలిపి దేశంలో అశాంతి సృష్టించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. సీజేపీ వంటి సంస్థలతో కలిసి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికార నివాసాన్ని ముట్టడించే పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ప్రజలు ఎప్పటికీ సమర్థించరని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పరిగి బీజేపీ ఇన్‌చార్జ్ బూనేటి కిరణ్ కుమార్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులు, ఏబీవీపీ కార్యకర్తలు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. సుమారు 150 మంది కార్యకర్తలు బీజేఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తూ రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా కొనసాగుతుండగా వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ పోలీసులు అక్కడికి చేరుకుని శాంతిభద్రతల దృష్ట్యా ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, దేశద్రోహ శక్తులతో కుమ్మక్కై దేశాన్ని విషం కక్కే ప్రయత్నాలు చేసే వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని హెచ్చరించారు.



ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించే చర్యలు ప్రజాస్వామ్య నిరసనలు కావని, అవి దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలుగా అభివర్ణించారు. భవిష్యత్తులో కూడా దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే గట్టి పోరాటం చేస్తుందని, దేశ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ రెడ్డి, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు, శ్రీకాంత్ రెడ్డి. మల్ రెడ్డి శ్రీకాంత్ ముద్రాజ్, తదితరులు బిజెపి నాయకులు యువ నాయకులు ఏబీవీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

- **బోధన్‌లో విజయవంతమైన విద్యాసంస్థల బంద్**

**బోధన్, నిజామాబాద్, 24 జూలై (ప్రజాక్షేత్రం):**

దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విద్యా విధానాలు, విద్యార్థి ఉద్యమాలపై జరుగుతున్న నిర్బంధ చర్యలను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ బోధన్ పట్టణంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎఫ్డీఎస్ జిల్లా కన్వీనర్ ఎండీ మోసిన్ మాట్లాడుతూ.. దేశ విద్యార్థులు, యువత తమ హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతుంటే వారిపై లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగాలు, అక్రమ నిర్బంధాలు చేయడం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అని అన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగించడం అత్యంత దుర్మార్గమని ఖండించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపించే విధంగా నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. విద్యార్థులు, యువతపై జరిగిన దాడులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, ఉద్యమకారులపై బనాయించిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. న్యూఢిల్లీలో కొనసాగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా నిర్వహించిన బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, గౌతం ప్రసాద్, నాయకులు మణితేజ, సాయినాథ్, ఏఐబీస్ నాయకులు గంగాప్రసాద్, రాజన్న, శ్రీను, అనిల్, ఏఐఎఫ్డీఎస్ నాయకులు అర్పిత్, నాగరాజు, సుమీద్‌తో పాటు పలువురు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్కూల్ బస్సు నిర్లక్ష్యం.. యూకేజీ చిన్నారి సహస్ర దుర్మరణం

- **చౌదర్‌గూడ మండలంలో హృదయ విదారక ఘటన..**
- **స్కూల్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్**

**షాద్ నగర్ జులై 24(ప్రజాక్షేత్రం):**

చౌదర్‌గూడ మండలంలో శుక్రవారం చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కాస్లాబాద్ గ్రామానికి చెందిన కృష్ణయ్య-మనీష దంపతుల కుమార్తె సహస్ర (యూకేజీ) స్థానిక అబ్యాస్ విద్యాపీఠం పాఠశాలలో చదువుతోంది. ప్రతిరోజులాగే ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లిన చిన్నారి, సాయంత్రం ఇంటి వద్ద దించే సమయంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది.

స్థానికుల వివరాల ప్రకారం...బస్సు ఇంటి వద్ద ఆపిన అనంతరం చిన్నారి దిగిన కొద్దిసేపటికే డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని వెనక్కి తీసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో సహస్ర బస్సు వెనుక భాగంలో ఉండటాన్ని గమనించకపోవడంతో బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన చిన్నారిని స్థానికులు వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో కాస్లాబాద్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సహస్ర మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్తులు కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఘటనకు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన శిక్షలు విధించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల రవాణాలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని, బస్సుల వద్ద సహాయక సిబ్బందిని నియమించాలని కూడా కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, డ్రైవర్ నిర్లక్ష్యం, స్కూల్ యాజమాన్యం బాధ్యతలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనతో మరోసారి పాఠశాల బస్సుల భద్రత, డ్రైవర్ల అప్రమత్తత, విద్యార్థుల రవాణా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నారుల ప్రాణాల భద్రత విషయంలో నిర్లక్ష్యం పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# భయం అంచుల్లో కేంద్రం..?

- **విద్యార్థి ఉద్యమాలపై ఎన్ఎస్ఏ ప్రయోగం చర్చకు దారితీస్తున్న వేళ...**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కు. అలాంటి ఉద్యమాలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు, కఠిన చట్టాలను ముందుకు తేవడం ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎస్ఏ) అమలుకు సిద్ధమవుతోందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దేశ భద్రతకు ముప్పు కలిగించే అసాధారణ పరిస్థితుల్లో వినియోగించాల్సిన ఎన్ఎస్ఏ వంటి చట్టాన్ని విద్యార్థులు, యువతపై ప్రయోగించే ఆలోచన ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఇప్పటికే నమోదైన కేసులకు తోడు, మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ చర్యలు ప్రభుత్వంలో పెరుగుతున్న అభద్రతాభావానికి సంకేతమని విమర్శకులు పేర్కొంటున్నారు.

ఇదే నిజమైతే కేంద్ర ప్రభుత్వం నూటికి నూరు శాతం అభద్రతా భావంలోకి జారిపోయినట్లే! కాక్రోచ్‌ల ఆందోళనకు భయపడినట్లే లెక్క? ఈ భయంకరమైన అస్త్రంతో కేసులు బనాయించి కాక్రోచ్ ఉద్యమాన్ని, తద్వారా మద్దతుగా కదులుతున్న ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసే దిశగా కేంద్ర అడుగులు వేస్తుందా? కనీస విచక్షణాధికారం మరచి ఈ నెల 15నుండి దీన్ని అమలు పర్చుతున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. అంటే ఈ నెల 20న పార్లమెంటు ముట్టడి పిలుపులో భాగంగా గాయపడిన, కేసులు పెట్టబడిన విద్యార్థులమీద ఈ అస్త్రం వినియోగం చేస్తారా? లేక బెదిరింపులకు ఉపయోగిస్తారా? అనేక కేసులతోపాటు, ఆర్నెళ్ల వరకు ఎలాంటి బెయిల్ రాని ఈ నల్లచట్టం ప్రయోగానికి సిద్ధంకావడంలోని ఆంతర్యం ఏమిటి? కేంద్ర పెద్దలు ఇంత అమానుష ఆలోచన, ఈ దిశగా ప్రయాణం చేయడానికి దారితీసిన పరిస్థితి ఏమిటి?

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జులై 20 సంఘటనల వీడియోలు సైతం చూడడానికి నిరాకరించడం, బిజెపి అధికారంలోకి రావడానికి కారణం అయిన అన్నా హజారే సైతం విద్యా మంత్రి రాజీనామా చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది తప్ప తరగదని ప్రధాని మోడీకి లేఖ రాసినా కనీస స్పందన లేకపోవడం, నెలకుపైగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నా కనీసం వారిని పట్టించుకోకపోవడం, గత 25 రోజులుగా రామన్ మెగసెస్ అవార్డు గ్రహీత, ప్రముఖ పర్యావరణ శాస్త్ర వేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరహార దీక్ష జరపడంతో పాటు ఆయన తాజాగా ఓ డిమాండ్ కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచారు. పార్లమెంట్ ముట్టడిలో పాల్గొన్న విద్యార్థులపై మోపిన కేసులను రద్దుచేసి, నీట్ పేపర్ లీకులపై జంతర్ మంతర్‌లోనే చర్చ జరిపితే తన నిరాహార దీక్ష విరమించుకుంటామని ప్రకటించారు. అయినా ప్రభుత్వంలో ప్రతిస్పందన లేదు. ప్రతిపక్షాలు కూడా కేంద్ర విద్యా మంత్రితో రాజీనామా చేయించాలని పార్లమెంటు లోపలా బయట ఆందోళన చేశారు. ఇన్ని రకాల ప్రతిపాదనలు కేంద్రం ముందుకు వచ్చినా అంతిమంగా బ్రిటీష్ వారి అధికార రక్షణకు ఉద్దేశించిన రౌలత్ చట్టం లాంటి నేషనల్ సెక్యూరిటీ యాక్టు (నాసా)ను విద్యార్థులపై ప్రయోగించడం అంటే ఇది దారుణమైన ఆలోచన, నిర్ణయంగానే చరిత్రలో నిలుస్తోంది.

నల్లచట్టం పెట్టడమే కాదు, దాన్ని జులై 15 నుండి అమలుచేయడం వెనుక ఆంతర్యం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై కక్ష సాధింపుగా భావించాల్సి ఉంటుంది. లేదా బెదిరింపులో అంతర్భాగం అయి నా అయి ఉంటుంది. ఏదిఏమైనా నాసా ప్రయోగం అనేది విచక్షణ కోల్పోయి జరిపే అణచివేత చర్య అని చెప్పక తప్పదు. ఇక్కడ దాకా జరిగిన పరిణామాల లోతుల్లోకి వెళ్లితే! పశ్చిమబెంగాల్ ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం లో ఈ రకమైన అతి విశ్వాసం పెరిగింది, రాజ్యాంగ సంస్థలను కనుసన్నల్లో నడుపుకోవడం, అధికారం నుండి అధికారం దిశగా ప్రయాణం చేయడం, నయానో భయానో ఎత్తుగడలో ఏ మార్పుతోనో ప్రతిపక్ష పార్టీలను బలహీనం చేయడం అనే రాజకీయ చదరంగం లో బిజెపి నెగ్గింది. అధికారం సుస్థిరం చేసుకోవడానికి వ్యవస్థలపై ఆధారపడే కంటే చట్టాలను చుట్టాలను చేసుకోవడం సులువైన మార్గంగా ఎంచుకున్నట్లు ఉంది. ప్రతిపక్షాలు బలహీనం కావడం అంటే దేశంలో ప్రజాస్వామ్య వాతావరణం క్షీణించడమే! అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఏడాది వరకు బెయిల్ రాని చట్టం తేవాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాజాగా కాక్రోచ్, ప్రతిపక్షాల అణచివేతకు కఠినమైన నాసా చట్టం కేంద్రం తెచ్చింది. అంటే దేశంలో ఇంకా జైళ్ళు నోర్లు తెరవబోతున్నాయని అర్థం అవుతుంది. పరోక్షంగా అప్రకటిత ఎమర్జెన్సీకి సిద్ధం అవుతున్న జాడలే కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు కేంద్ర ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అమలు జరుపుకొంటూ వస్తున్నవే? ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాసమస్యలుపై ఆందోళన సహజమే! అయితే, ఇంత వేగంగా పరిణామాలు మారడం వెనుక ఉన్న పరిస్థితి మరేమీ లేదు. కాక్రోచ్ ఉద్యమం కేంద్ర



ప్రభుత్వం మొండి వైఖరిపైనా, అహంపైనా తిరుగులేని దెబ్బ తీసింది. జులై 20 విద్యార్థుల పార్లమెంటు ముట్టడి తిరుగుబాటుగానే ప్రభుత్వం భావిస్తోంది. జంతర్ మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనకు చాలా కాలం కేంద్రం అసలు స్పందించ లేదు. చాలా తేలిగ్గా తీసుకుంది. ఇక సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 20వ రోజుకు చేరడంతో దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, ప్రజల్లో కూడా సానుభూతి, కదలిక మొదలైంది. ఆయన్ను బలవంతంగా అరెస్టు చేసి ఆస్పత్రికి తరలిస్తే సమస్య సమసిపోదని అర్థం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. కాక్రోచ్ జనతా పార్టీ పార్లమెంటు ముట్టడికి ప్రయత్నం చేయడం, కేంద్రం ఊహకందని రీతిలో విద్యార్థులు ఆటంకాలు అధిగమించి తరలిరావడం, లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం చేసినా విద్యార్థులు పార్లమెంటు ముంగిటకు అడుగు పెట్టడంతో కేంద్ర పెద్దలలో అసహనం మొదలైంది. పోలీసులు, విద్యార్థులు గాయపడ్డారు

తొలిసారి కేంద్ర ప్రభుత్వం ప్రజల్లో పలచనఅయింది. పరాభవ శిరోభారం మోయలేక పోయింది? గోదీ మీడియాను కూడా గుర్తించి విద్యార్థులు వారిని తరిమికొట్టడం కూడా కేంద్ర పెద్దల అహం ఒకింత దెబ్బతింది. కేంద్రం పన్నెండేళ్ళుగా అణచివేత చర్యల్లో తనదైన ముద్ర వేసుకొంది. భీమాకోరెగాం కేసు నుండి అర్బన్ నక్సల్స్ వరకు కఠినమైన కేసులు, చట్టాల ద్వారా మేధావులపై నిర్బంధం విధించడం, జైలుపాలు చేయడం, ఆపరేషన్ కగార్ పేరుతో నక్సల్స్ అణచివేతలో సక్సెస్ కావడం కేంద్ర పెద్దల్లో తిరుగులేని ఆత్మవిశ్వాసం ఏర్పడింది. అయితే అనూహ్యంగా ముందుకు వచ్చిన కాక్రోచ్ ఉద్యమాన్ని అంచనా వేయడంలో కేంద్ర పెద్దలు బోల్తాపడ్డారు. జెల్లపురుగే గదా అనుకుంటే కేంద్రం ప్రతిష్ఠకు జెల్లీ కొట్టింది. ఒకరకంగా జులై 20 విద్యార్థుల, యువత తిరుగుబాటు కేంద్రం విధానాలపై పోరాడే వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపింది. కేసులు, జైళ్ళు, కోర్టులకు భయపడి దూరంగా ఉన్న వివిధ వర్గాలకు కాక్రోచ్ ఉద్యమం ఒక రకంగా ఊపిరి ఊదింది. కేంద్ర మంత్రితో రాజీనామా చేయించి విద్యార్థి ఉద్యమం చల్లార్చి ఉంటే ఈ సమస్య ఇలా జటిలం అయ్యేది కాదు. నిరంకుశ అధికారాలు దాఖలుపడ్డ కేంద్రం సైతం వెనుకడుగు వేయడానికి ఇష్టపడకపోవడమే కోతి పుండు బ్రహ్మరాక్షసి అయినట్లు సమస్య జటిలం అయింది. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే గడచిన పన్నెండేళ్ళుగా బిజెపి రాజకీయ చాణక్యం తప్ప, ప్రజా సమస్యల ద్వారా ప్రజల్ని తమ వైపు తిప్పుకున్న జాడలు లేవు. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరగడం, రూపాయి విలువ కుంచించుకుపోవడం లాంటి సమస్యలతో ప్రజల్లో అసంతృప్తి రగులుతున్నది. తాము ప్రజల్లో పలచనైతే కలిగే పరిణామాలు ఏమిటో కేంద్ర వ్యూహ కర్తలకు తెలుసు. ఊహకందనవి కూడా కాదు. కనుక కేంద్రం కఠిన చట్టాల ద్వారా అణచివేత చర్యల వైపే మొగ్గు చూపుతున్నది. నిర్దాక్షిణ్యంగా ఎంతో భవితవ్యం ఉన్న యువతపై కఠిన చట్టాల ప్రయోగం వైపు ప్రభుత్వం ఆలోచనలు చేయడం సరికాదు. కనుక సమస్య తెగేదాకా లాగి, జటిలం అయ్యే దిశగా తీసుకుపోకుండా కేంద్ర ప్రభుత్వంపెద్ద మనస్సుతో ఆలోచనలు చేయాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని ఆశిద్దాం.



ఏం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777



## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

- **నీట్‌పై రాజకీయాలు వద్దు: సుభాష్**
- **బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం**

**పెద్దకొడప్‌గల్, జులై 24(ప్రజాక్షేత్రం):** మండల కేంద్రం లోనీ గాంధీ చౌక్ వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహన చేశారు.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌక్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మలయాల సుభాష్ మాట్లాడుతూ, దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించాయని ఆరోపించారు. నీట్ పరీక్షల అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు, దేశ వ్యతిరేక శక్తులు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సంజయ్ పాటిల్, కృష్ణ పంతులు, హన్మండ్లు, నాందేవ్, మోహన్, ఇందాల్, యువ నాయకుడు తనాజీ రావు, చిప్ప రామేశ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హెగ్డోలి, సాలూర, ఖాజాపూర్‌లో వ్యవసాయ విద్యార్థినుల గ్రామీణ సర్వే..

- **వర్షా భావ పరిస్థితులపై రైతులకు శాస్త్రవేత్తల శిక్షణ**

**పోతంగల్/కోటగిరి, జూలై 24 (ప్రజాక్షేత్రం):** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని హెగ్డోలి, సాలూర, ఖాజాపూర్ గ్రామాల్లో జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా సందడి చేశారు. రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో 'సహభాగస్వామ్య గ్రామీణ స్థితిగతుల అంచనా' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.గ్రామ వనరులపై సమగ్ర పరిశీలన:స్థానిక రైతులు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ వ్యవసాయ పరిస్థితులు, నీటి వనరులు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అంచనా వేసేందుకు ఈ వినూత్న పద్ధతిని చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థినులు గ్రామాల్లో పర్యటించి.. పంటల సరళి, లభ్యమవుతున్న వనరుల వివరాలను విశ్లేషించారు. అనంతరం ఆయా గ్రామాల వ్యవసాయ ముఖచిత్రాన్ని (నమూనా చిత్రాలను) నేలపై గీసి రైతులకు స్పష్టంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు.వాతావరణ మార్పుల ముప్పు ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం:ఈ సందర్భంగా రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా.కె. ఇందుధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ మార్పులు (వర్షాభావ పరిస్థితుల) తరుణంలో రైతులు సాంప్రదాయ సాగు పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకునేందుకు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే మొక్కజొన్న, కంది, సోయాచిక్కుడు, పెసర, మినుము వంటి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.వరి సాగులో శాస్త్రవేత్తల కీలక సూచనలు:తడిపొడి పద్ధతి: వరి సాగు చేసే రైతులు నీటి వృధాను అరికట్టేందుకు 'మార్పిడి తడిపొడి' పద్ధతిని పాటించాలి. పొలంలో నీటిని తరచుగా తీస్తూ, మళ్లీ పెడుతూ సాగు చేయాలి.నారు నాటడం: ఒకవేళ 35 రోజులు పైబడిన ముదురు నారు వేయాల్సి వస్తే, ప్రతి కుదురుకు తప్పనిసరిగా 4 నుంచి 5 పిలకలు ఉండేలా చూసుకోవాలి.ఎరువుల నియంత్రణ: వరిలో రసాయన ఎరువుల వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని స్పష్టం చేశారు.ఈ నూతన వ్యవసాయ శిక్షణా కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా.కె. ఇందుధర్ రెడ్డితో పాటు హెగ్డోలి, సాలూర, ఖాజాపూర్ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు, జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకల భాగంగా గిఫ్ట్ ఏ స్మైల్ లో పరీక్ష ప్యాడ్ లు పంపిణీ.

**ప్రజాక్షేత్రం/ పెద్దపల్లి జులై 25:** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని అంకంపల్లి పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష మరియు స్వీట్లను బిస్కెట్లను పంపిణీ చేశారు,భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ,సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు అవసరమయ్యే కార్యక్రమాన్ని చేపట్టడంలో భాగంగా ఈరోజు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ పాల్గొని పరీక్ష ప్యాడ్లు అందజేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆకుల స్వామి వివేక్ పటేల్ ని సత్కరించారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగరాజు యాదవ్., పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కర్నే రాజు నేత జాగినపు నర్సింగం,పాఠశాల సిబ్బంది యువజన నాయకులు మొదలైన వారి కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలి

- **రైతులకు పూర్తి మద్దతు అందించాలి: సీఎస్ సంజయ్ జాజు**


**కామారెడ్డి జిల్లా బ్యూరో, జులై 24(ప్రజాక్షేత్రం):** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి ఎల్ నినో పరిస్థితులు, పంటల వైవిధ్యీకరణ, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై వివిధ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధోరణులను దృష్టిలో ఉంచుకుని సుమారు 30 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. వాతావరణ శాఖ అంచనాలు నిజమవుతున్న నేపథ్యంలో ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.రైతుల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు *కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)*పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వరి మాత్రమే కాకుండా పత్తి సహా దాదాపు 20 పంటలకు ఎంఎస్పీ అమలులో ఉందని, మార్కెట్ ధర ఎంఎస్పీ కంటే తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు స్పష్టంగా వివరించాలని ఆదేశించారు.ప్రత్యామ్నాయ పంటల వల్ల ఆదాయం తగ్గదని, కొన్ని సందర్భాల్లో మరింత లాభం పొందే అవకాశం ఉంటుందని




పేర్కొన్న సీఎస్,కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు.అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్ష**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థికి వెంటనే ఒక జత యూనిఫాం అందించి, ఆగస్టు 30లోగా రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. వస్త్రాల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులకు పంటల మార్పిడి,



ప్రత్యామ్నాయ పంటల లాభాలు, కనీస మద్దతు ధర లభించే పంటలు, కూరగాయల సాగుపై రైతు వేదికలు, రైతు వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం పంటల సాగు విస్తీర్ణంపై సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ దామోదర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394